శని వారం
30-12-2023
సంపుటి - 08,
సంచిక - 419
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు వార్త పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ట్రంప్‌కు షాక్ మీద షాకులు!



**వాషింగ్టన్, డిసెంబర్ 29 (సమ సమాజం):** రెండవ సారి అమెరికా అధ్యక్ష పీఠం అధిష్టించాలని బావిస్త న్న డొనాల్డ్ ట్రంప్‌కు దారులు ఒక్కొక్కటిగా మూసుకుపోతున్నాయి. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి త్వానికి పోటీ చేసేందుకు ఆయన అనర్హుడంటూ కొలరాడో న్యాయస్థానం ప్రకటించిన పట్టుమని పదిరోజుల గడవక ముందే.. మరో రాష్ట్రం షాక్ ఇచ్చింది. ట్రంప్ పోటీకి అనర్హుడంటూ మైనే స్టేట్ గురువారం ప్రకటించింది. అమెరికా చట్టసభ క్యాపిటల్ పై 2021, జనవరి 6వ తేదీన ట్రంప్ మద్దతు దారులు దాడి చేశారు. అయితే ఆ దాడికి అప్పటి దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపే ప్రధాన కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతీ తెలిసిందే. దీంతో.. వచ్చే ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నిక మైనే స్టేట్ తరఫున పోటీ చేసేందుకు ట్రంప్ అనర్హుడంటూ అక్కడి ఎన్నికల విభాగం నిర్ణయించింది. దీంతో.. మైనే రాష్ట్ర కార్యదర్శి షెన్నా బెల్లోస్ గురువారం ప్రకటన చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2024 అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి.. రిపబ్లికన్ పార్టీ తరఫున నామినేషన్‌లో ముందంజలో ఉన్నారు. కానీ 2020 ఎన్నికలకు సంబంధించి తప్పుడు ప్రచారంతో ఆయన తిరుగుబాటును ప్రేరేపించారు. క్యాపిటల్‌పైకి కవాతు చేయాలని ట్రంప్ తన

3వ పేజీలో...

## టీఎస్ఆర్టీసీకి 1,050 కొత్త బస్సులు

రూ.400 కోట్ల వ్యయంతో కొనుగోలుకు సన్నద్ధం



**హైదరాబాద్, డిసెంబర్ 29(సమ సమాజం):** ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అడుగులు వేస్తోంది. అందులో భాగంగా కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రూ.400 కోట్ల వ్యయంతో 1,050 అధునాతనమైన కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయిం తీసుకున్నట్లు చెప్పారు. కొత్తగా 512 పల్లెవెలుగు, 400 ఎక్స్‌ప్రెస్, 92 లహరీ స్లీపర్ కమ్ సీటర్, 56 రాజధాని ఏసీ బస్సులను సంస్థ కొనుగోలు చేయనున్నట్లు సజ్జనార్ పేర్కొన్నారు. అలాగే జీహెచ్‌ఎంసీ పరిధిలో 540, తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో 500 ఎలక్ట్రిక్

3వ పేజీలో...

## తెలంగాణ 'ప్రజాభవన్' ఘటనలో కొత్త కోణం

**హైదరాబాద్, డిసెంబర్ 29(సమ సమాజం):** హైదరాబాద్ బేగంపేట లోని ప్రజాభవన్ వద్ద ఈ నెల 23న జరిగిన ర్యాష్ డ్రైవింగ్ కేసులో.. ప్రధాన నిందితుడు సాహిల్‌ను తప్పించి మరొకరిని నింది తుడిగా చేర్చిన సంగతి తెలిసిందే. అయితే.. ఇందులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తనయుడిని ఎలా తప్పించారనే విషయం తాజాగా వెలుగు చూసింది. ప్రమాదం జరిగిన రోజున రాత్రి డ్యూటీలో ఉన్న ఇన్‌స్పెక్టర్ దుర్గారావు.. ఘటనాస్థలం నుంచి సాహిల్‌ను కారులో పంజాగుట్ట ఠాణాకు తీసుకొ చ్చారు. కానిస్టేబుల్‌కు అప్పగించి, పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బ్రీత్‌ఎనలైజర్ పరీక్ష కోసం

3వ పేజీలో...




## గ్యారెంటీల దరఖాస్తు కౌంటర్ల వద్ద అప్లికేషన్ల కొరత



**హైదరాబాద్, డిసెంబర్ 29(సమ సమాజం):** తెలంగాణ వ్యాప్తంగా ఆరు గ్యారంటీల దరఖాస్తు కౌంటర్ల వద్ద రద్దీ కొనసాగుతోంది. ఇక హైదరాబాద్ నగరంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒక్కో వార్డు లో నాలుగు కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఒక రోజు ముందుగానే దరఖాస్తు ఫారాలను అందజేస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు చెప్పిన విషయం తెలి సిందే. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది. . ఒక్కో కేంద్రంలో వందల సంఖ్యలో నే దరఖాస్తు ఫారాలు

3వ పేజీలో...

## రేషన్ కార్డు ఉంటేనే రైతుభరోసా?



**హైదరాబాద్, డిసెంబర్ 29(సమ సమాజం):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుభరోసాపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ స్కీం అర్హుల విషయంలో కొత్త నిబంధనలు తెస్తు న్నట్టు సమాచారం. రేషన్ కార్డు ఉంటేనే రైతుభరోసా అందనుందా అనే చర్చ జరుగుతోంది. అలా గే, పెట్టుబడి సాయానికి పరిమితి విధించే దిశగా కాంగ్రెస్ సర్కారు అడుగులు వేస్తోందా అనేది కూ డా ప్రశ్న. రైతుభరోసాకు రేషన్ కార్డును లింక్ చేసే దిశగా చర్యలు చేపట్టడమే అందుకు కారణం. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 'గ్యారెంటీ' దరఖాస్తులకు రేషన్ కార్డు ప్రతిని జత చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. దాని ప్రకారమే దరఖాస్తులో రేషన్ కార్డు నంబర్, రైతుభరోసా కాలమ్ ఉన్నాయి. దీన్ని బట్టే పెట్టుబడిసాయానికి, రేషన్ కార్డుకు లింక్ చేస్తారన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. సాధారణంగా ప్రతిసారి సీజన్‌కు ముందుకు కొత్త రైతులు ఎవరైనా ఉంటే వారి నుంచి ఆయా ఏఈవోలు దరఖాస్తులు స్వీకరించి వారి పేర్లను రైతుబంధు జాబితాలో చేర్చుతారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాకు కొత్త రైతుల ఎంపికను ప్రత్యేకంగా రేషన్ కార్డుతో సంబంధం ఉన్నటువంటి గ్యారెంటీల దరఖాస్తులో చేర్చింది. ఇది ఏ మేరకు సక్సెస్ అవు తుందో పరిశీలించాక ఓ నిర్ణయం

3వ పేజీలో...

# మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం బాధాకరం

### కాళేశ్వరం కంటే ప్రాణహిత-చేవెళ్ల ఉత్తమం



❑తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీరందించేలా డిజైన్ ❑మేడిగడ్డ కుంగినప్పటి నుంచి కేసీఆర్ స్పందించలేదు ❑ప్రాజెక్టుపై న్యాయ విచారణ చేపడతాం ❑నీటిపారుదుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ❑మేడిగడ్డ బ్యారేజ్ ను సందర్శించిన మంత్రులు

**హైదరాబాద్, డిసెంబర్ 29(సమ సమాజం):** కాళేశ్వరం కంటే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఉత్తమమైనది అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు తెలంగాణ మంత్రులు వెళ్లారు. ఈ సందర్భంగా నీటిపారుదుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీరందించేలా డిజైన్ చేశామని అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు , పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోటమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. మేడిగడ్డ కుంగినప్పటి నుంచి కేసీఆర్ స్పందించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం బాధాకరమని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ చేపడతామని అసెంబ్లీలో ప్రకటించిన సంగతిని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు వ్యయాన్ని 80 వేల కోట్ల నుంచి లక్షా యాభై వేల కోట్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిందని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్నా కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ ఒకే విధానంతో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గతంలో రూ.38 వేల కోట్ల వ్యయంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించి 16.40 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడానికి నిర్ణయించామన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.80 వేల కోట్లు వ్యయంతో 18 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడానికి నిర్ణయించిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇంజినీర్ల సలహాలు కేసీఆర్ తీసుకున్నారా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంజినీర్లుగా సలహాలు ఇవ్వాలి.. వినకపోతే సెలవు పెట్టి పోవాలని స్పష్టం చేశారు. కొండపోచమ్మ ప్రాజెక్టు ఎప్పుడూ నిండుగా ఉంటుందన్నారు. ఫామ్‌హౌస్‌కు తప్ప ఇతర పొలాలకు నీరు పోదన్నారు.ఇంత ఖర్చు చేసినా ఎంత ఆయకట్టుకు నీరు వెళ్తోందని కోమటిరెడ్డి నిలదీశారు. కాళేశ్వరం కోసం ఎంత విద్యుత్ వాడారు? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. మేడిగడ్డ

3వ పేజీలో...

## 14 రాష్ట్రాల మీదుగా భారత్ న్యాయ యాత్ర

### 8న ఖరారుకానున్న రూట్ మ్యాప్



3వ పేజీలో...

## ఎన్నికల సంవత్సరం వేళ

పెట్రో ధరలు తగ్గించే యోచన ?




**న్యూఢిల్లీ, డిసెంబర్ 29(సమ సమాజం):** వాహన చోదకులకు గుడ్ న్యూస్. ఇంధన ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. 2024లో లోక్‌సభ ఎన్నికలు రానున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇంధన ధరల్లో భారీ కోత ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. పెట్రోల్ ధరపై రూ.10 వరకూ తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. మే 2022లో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్

3వ పేజీలో...

## వేగంగా వ్యాపిస్తున్న కొత్త కోవిడ్ వేరియంట్

కేరళలో జేఎన్1తీవ్ర వ్యాప్తి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 29(సమ సమాజం):** మరోమారు కరోనా మహమ్మారి ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పుడిప్పుడే వైరస్ భయం నుండి బయటపడిన ప్రపంచం కోలుకుంటుంది..ఈ క్రమంలోనే కోవిడ్ కొత్త రూపంలో కోవిడ్ కోరలు చాస్తుంది. కోవిడ్- 19 వైరస్ ఓమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్1 విస్తృతంగా వ్యాపిస్తోంది. జేఎన్1 అనేది శరీరంలో ఉన్న రోగనిరోధక శక్తిని సులభంగా అధిగమించి మనుషుల్లోకి ప్రవేశించగల, ఎఫెక్టీవ్ వైవిధ్యంగా చెబుతున్నారు నిపుణులు. అంటే ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి అతి తక్కువ సమయంలోనే చేరుతుంది. ఇప్పుడు కేరళలోనూ జేఎన్1 తీవ్ర పరిస్థితి నెలకొంది. వరుస సెలవులు, వేడుకల సమయం కాబట్టి జేఎన్1 కోవిడ్ కేసులు పెరిగే అవకాశం ఉందని అందరూ ఆందోళన చెందుతున్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో కోవిడ్ కేసుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కేరళలో పరిస్థితి కాస్త విపరీతంగా ఉందని చెప్పొచ్చు. ఇదిలా ఉండగానే.. కొత్త కోవిడ్ వైరస్ వేరియంట్ జేఎన్1 కూడా న్యుమోనియాకు దారితీస్తుందనే నిర్ధారణ ఆందోళనను రెట్టింపు చేస్తోంది. దీంతో

3వ పేజీలో...

# మారుతున్న రాజకీయ స్వరూపం !

ప్రశ్నించే గొంతులను వినిపించుకోకపోతే... ప్రజాస్వామ్య ఉనికే ప్రశ్నార్థకమవుతుందని పాలకవర్గాలు గ్రహించలేక పోతున్నాయి.ఈ యేడది పరిస్థితులు,పాలకుల తీరును గమనిస్తే ఇది స్పష్టంగా గమనించ వచ్చు. కేంద్రంలోని బిజెపి కావచ్చు ...లేదా ఉభయతెలుగు రాష్ట్రాల్లోని పాలకులు కావచ్చు..దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీల పాలకులు కావచ్చు..పాలకులుగా ప్రజల ఆందోళనలు అర్థం చేసుకోలేక పోయారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ మూల్యం చెల్లించుకున్నారు. తనకు తిరుగులేదని, జాతీయ రాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతానని చెప్పి విర్రవీగి చతికిలపడ్డారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పట్టించు కోకుండా ..మళ్లీ మాదే అధికారం అని విర్రవీగిన కెసిఆర్ అహంకారంపై ప్రజలు తిరుగుబాటు చేశారు. ఈ యేడాది చివరలో ఇదో అద్భుత చరిత్రగా మిగిలిపోతుంది. గత ఐదేళ్లలో ధరలు దాడి చేశాయి. ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. స్థూల దేశీయోత్పత్తి జిడిపి బాగా క్షీణించింది. దేశంలోని కార్పొరేట్లు... వ్యాపారులు, భూస్వామ్యులు, బడా విదేశీ పెట్టుబడి దారులు మరింతగా బలపడ్డారు. అంతిమంగా సామాన్యులు బాగా బలహీనపడ్డారు. వీటిని చక్కదిద్దే ప్రయత్నాలు జరగడం లేదు. కేంద్రంలోని బిజెపి మరోమారు అధికారంకోసం అర్రులు చాస్తోంది. తెలంగాణ లో కనీసం పది పార్లమెంట్ సీట్లపై గురిపెట్టింది. మొన్నటి ఎన్నికల్లో కొంతమెరుగైన పరిస్థితిని గమనించి కావచ్చు... బిజెపిలో ఆశలు పుట్టాయి. అందుకే హైదరాబాద్ వచ్చిన అమిత్ షా ఇదే విషయం ఉద్బోధించి వెళ్లారు. ఆశపడడంలో తప్పులేదు. కానీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామా లేదా అన్న చర్చ చేయడం లేదు. తెలంగాణలో ప్రజాపాలనకు తెరలేచింది. ప్రజలకు గొంతు విప్పే అవకాశం వచ్చింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం...ప్రజల్లో ఓ రకమైన భరోసా దక్కడం..గత పాలకుల పాపాలు బయటపడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం దేశంలో వస్తున్న మార్పులను గమనించడం లేదు. ఎదుటి పార్టీలను అణచివేయడం...డబ్బులను పప్పుబెల్లాల్లా పందేరం చేయడంతో తన అధికార పీఠాన్ని పదిలం చేసుకోవచ్చన్న ధీమాతో రాజకీయాలు చేస్తున్నారు. ఎపిలో కూడా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. షర్మిలను రంగంలోకి దింపడం ద్వారా పోయిన ప్రతిష్టను పొందాలని చూస్తోంది. ఇది సాధ్యమా కాదా అన్నది ముందుందు తేలనుంది. అయితే పాలకులు మాత్రం ప్రజలు సమస్యలు తమ ఎజెండాలో లేవన్న స్థిరాభిప్రాయంలో ఉన్నారు. ఇకపోతే మోడీని వ్యతిరేకించే శక్తులు ఏకం కావడం మొదలయ్యింది. ఏకపక్ష నిర్ణయాలతో మోడీ ప్రజాభి ప్రాయాలను తుంగలో తొక్కుతున్నారు. ఇటీవల మూకుమ్మడిగా పార్లమెంటులో ఎంపిల సస్పెన్షన్ బిజెపి అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు పరాకాష్టగా చూడాలి. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర రాజకీయ ప్రయోజనాలు ఇచ్చిందనడానికి కర్నాటక, తెలంగాణ పరిణామాలు నిదర్శనంగా చూడాలి. ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనా విధానంపై చర్చకు అవకాశం ఇచ్చింది. ఇండియాకూటమిలో ఎన్ని లుకలుకలు ఉన్నా కాంగ్రెస్ కేంద్రంగా విపక్షాలు కలసి వెళ్లని పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో ఎక్కడో ఒకచోట ప్రశ్నించే తత్వం రావాలి. కేంద్రంలోని బిజెపిని ఢీకొనేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ శక్తులు సమాయత్తమవుతున్నాయి. అయితే పాలనలో ఉన్న వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయపార్టీలు తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ.. కేవలం మోడీవైపు వేలెత్తి చూపుతున్నాయి. దీనిని కూడా ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. నిజానికి స్థానిక ప్రభుత్వాలపై ప్రజలు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నాయి.. బిహార్‌లో బిజెపి ప్రభుత్వాన్ని వదిలించుకుని మహాకూటమి సర్కార్ ఏర్పాటు చేసిన నితీశ్ కుమార్ వ్యవహారశైలి కూడా పెద్దగా ఆశాజనకంగా లేదు.

ఢిల్లీలో బిజెపి ఉధృతిని అడ్డుకుని పంజాబ్,ఢిల్లీల్లో పాగా వేసిన అరవింద్ కేజ్రీవాల్ మరోవైపు సవాల్ చేస్తున్నా..ఆయన అనుచరులు కూడా పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయారు. తన ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చి కేసీఆర్ కూడా బిజెపిపై సవాళ్లు విసిరి చతికిల పడ్డారు. రాజకీయంగా చూస్తే, గడచిపోతున్న సంవత్సరం అంతా మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి పెద్ద విజయాలనే అందించింది. తెలంగాణ మినహా మూడు రాష్ట్రాల్లో అధికార పగ్గాలు చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లో సాధించిన విజయాలే 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపి తిరిగి జాతీయ స్థాయిలో అధికారం చేజిక్కించు కుంటుందన్న ధీమాలో బిజెపి నేతలు ఉన్నారు. అందుకే బిజెపి తన పూర్తి దృష్టిని ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రీకరించింది. ప్రతిపక్షాలు నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపితో హోరాహోరీగా పోరాడు తున్నాయి. అయినా పెద్దగా విజయం సాధించడం లేదు. 2024 నాటికి కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బిజెపితో తలపడేందుకు సన్నద్ధం కాగలుగుతుందని తహతహలాడుతోంది. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి ఎందుకో దేశంలోని సామాన్యులను నేటికీ దరిచేర్చుకోవడం లేదు. ప్రధాన సమస్యలపై స్పందిం చడం లేదు. ఆర్థిక సమస్యలను,ధరల పెరుగుదలను పట్టించుకోవడం లేదు. 2024 ఎన్నికలకు జాతీయ స్థాయిలో బిజెపి వ్యతిరేక పక్షాలు ఏ రూపంలో వస్తాయన్నదానికి స్పష్టత లేదు. సిబిఐ,ఈడీలతో పాటు అనేక వ్యవస్థల్నీ బిజెపి పెద్ద ఎత్తున ఉపయోగిం చుకుని ప్రత్యర్థుల్ని నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, ఇతర నేతలపైనే 95 శాతం పైగా సిబిఐ కేసులున్నాయి. ఇకపోతే ఏడాది చివరలో మరోమారు కరోనాకొత్త వేరియంట్ భయపెడుతోంది. ఇప్పటికీ దీనిపీడ విరగడ అయ్యిందన్న ధీమా రావడంలేదు. ఈ కారణంగా 2023 సంవత్సం ప్రజలకు ఎలాంటి ఆనందాన్ని ఇవ్వలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వదిలిపెట్టి పాలకులు, పార్టీలో ఎన్నికల్లో గెలవడమెలా...అన్న విషయంలో వ్యూహకర్తలతో మంతనాలు చేస్తున్నారు. ఈ తరహా రాజకీయాలు పోనంతవరకు దేశం బాగుపడదన గుర్తించాలి.

# ఆర్టీసిలోకి మరో 80 కొత్త బస్సులు

## నేడు ప్రారంభించనున్న మంత్రి పొన్నం



హైదరాబాద్, డిసెంబర్ 29 (సమ సమాజం): నేటి నుంచి 80 కొత్త బస్సులు అందుబాటులోకి వస్తాయని టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ విగ్రహం దగ్గర బస్సులు ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. కొత్త బస్సులను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని చెప్పారు. 80 కొత్త బస్సుల్లో 30 ఎక్స్‌ప్రెస్‌లు, 30 రాజధాని ఏసీ, 20 లహరి స్లీపర్, సీటర్ బస్సులు ఉంటాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేస్తున్నది. ఎప్పటికప్పుడు రవాణారంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చు కుంటూ.. వినూత్న పద్ధతుల్లో ప్రయాణికులకు చేరువవుతున్నది. ఈ క్రమంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.400 కోట్ల వ్యయంతో 1,050 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, మరో 56 ఏసీ రాజధాని బస్సులను కొనుగోలు చేయనున్నది. వీటికి తోడు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను హైదరాబాద్ సిటీలో 540, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 500 బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపడుతున్నది. కొత్త బస్సులన్నీ విడుతలవారీగా వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో బస్సుల్లో రద్దీ పెరిగింది. ఈ క్రమంలో అత్యాధునిక హంగులతో 80 కొత్త బస్సులు శనివారం రోడ్డెక్కించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో 30 ఎక్స్‌ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరి స్లీపర్ కమ్ సీటర్ (నాన్ ఏసీ) బస్సులున్నాయి. ఆయా బస్సులను హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించనున్నారు.

# 'ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీలను మోసం చేసిన బాబు

## అనంత సామాజిక సాధికార యాత్రలో వైసిపి నేతలు



అనంతపురం,డిసెంబర్ 29 (సమ సమాజం): 'ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీలను మోసం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు అని మాజీమంత్రి పేర్ని నాని అన్నారు. అనంత యాత్రలో ఆయన మాట్లాడుతూ..వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రకు అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. శుక్రవారం అనంతపురం నియోజకవర్గంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతపురంలో ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బస్సు యాత్ర అంబేద్కర్ విగ్రహం నుంచి పాతవూరు గాంధీ విగ్రహం వరకూ సాగింది. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రి ఉషాశ్రీచరణ్, మాజీ మంత్రి పేర్ని నాని, జూపూడి ప్రభాకర్, ఎంపీ తలారి రంగయ్య తదితరులు హాజరయ్యారు. వెనుకబడిన వర్గాలకు చంద్రబాబు ప్రాధాన్యత లేదు. చంద్రబాబు హయాంలో మైనారిటీ, ఎస్టీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించలేదు. ఓడిపోయిన నారా లోకేష్‌కు మంత్రి పదవి ఇచ్చారు. 17 మంది ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంత్రి వర్గంలో స్థానం కల్పించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌దే. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు సంక్షేమం ఎందుకు పట్టించుకోలేదు?, రుణమాఫీ పేరుతో రైతులు డ్వాక్రా రుణాలను మోసం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు. మీకు మంచి జరిగుంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి'అని విజ్ఞప్తి చేశారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినవ అంబేద్కర్ వంటి వారు. ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మళ్ళీ వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. 'వైఎస్ జగన్ సీఎంగా ఉన్నంతకాలం సంక్షేమ పథకాలు ఉంటాయి. అభివృద్ధి విషయంలో వైఎస్సార్ ఒక అడుగు ముందుకేస్తే, సీఎం జగన్ రెండు అడుగులు వేస్తున్నారు' అని పేర్కొన్నారు.

# ఖైదీలకు సంతానోత్పత్తి హక్కుంది: ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ, డిసెంబర్ 29 (సమ సమాజం): తమ వంశాన్ని నిలబెట్టుకునే హక్కు ఖైదీలకూ ఉంటుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. హత్య కేసులో జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్న వ్యక్తికి నాలుగు వారాల పాటు పెరోల్ మంజూరు చేసింది. తన భర్త ద్వారా సంతానాన్ని పొందే అవకాశం కల్పిం చాలన్న అతని భార్య అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరిం చింది. భార్య వయసు 38 ఏళ్లు, భర్త వయసు 41 ఏళ్లను ప్రస్తావిస్తూ....శిక్షా కాలం పూర్తయ్యాక ఆ దంపతులకు సంతానాన్ని పొందే వయసు మీరిపోతుందని, వయోభారం వారి ఉమ్మడి ఆకాంక్షకు అవరోధంగా మారుతుందని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ అభిప్రాయపడ్డారు. తన భర్త ద్వారా సంతానా న్ని పొందాలన్న భార్య హక్కును ప్రభుత్వం అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులోని పూ ర్వాపరాలను పరిశీలించిన తర్వాత ఖైదీకి తన వంశాన్ని నిలుపుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తీర్పులో వివరించారు. దాంపత్య జీవనం కోసం అనుమతివ్వడం లేదని, వంశాన్ని నిలబెట్టుకోవా లన్న భార్య ఆకాంక్షను, హక్కును గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఖైదీ ఇప్పటికే 14 ఏళ్లుగా జైలులో ఉన్న విషయాన్నీ న్యాయమూర్తి ప్రస్తావించారు. పెరోల్ కోసం రూ.20 వేలకు వ్యక్తిగత బాండును సమర్పించడంతో పాటు ఒకరి పూచీకత్తు ఇవ్వాలని షరతు విధించారు.

# ముంబై నుంచి ఆయోధ్యకు ముస్లిం యువతి పాదయాత్ర



ముంబై, డిసెంబర్ 29 (సమ సమాజం): వచ్చే నెలలో అయోధ్యలోని రామజన్మభూమిలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులారా వీక్షించాలని దేశ, విదేశాల్లో కోట్లాది మంది ఎదురు చూస్తు న్నారు. అటువంటివారిలో మహారాష్ట్రలోని ముంబైకి చెందిన షబ్నమ్ ఒకరు. ముస్లిం మతానికి చెందిన షబ్నమ్ శ్రీరాముని పట్ల అచంచలమైన భక్తి, విశ్వాసాలను ప్రదర్శిస్తున్నారు. శ్రీరాముని పూజించడానికి హిందువుగా ఉండాల్సిన అవసరం లేదని, మంచి మనిషిగా ఉండటమే ముఖ్యమని గట్టిగా చెప్తున్నారు. కాషాయ జెండాను ధరించి అయోధ్యకు పాదయాత్ర చేస్తున్నారు. రమణ్ రాజ్ శర్మ, వినీత్ పాండేలతో కలిసి ఆమె 1,425 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తున్నారు.

# ఎగబడి చలాన్లు కడుతున్న వాహనదారులు

## రెండు రోజుల్లోనే రూ.8.44 కోట్ల ఆదాయం



హైదరాబాద్,డిసెంబర్ 29 (సమ సమాజం): వాహనదారులతో చలాన్లు కట్టించడానికి అధికారులు ఎన్నో తిప్పలు పడుతుంటారు. భయపెట్టినా, బతిమాలినా ట్రాఫిక్ పెండింగ్ చలాన్లు చెల్లించడానికి మొగ్గు చూపరు. అయితే అధికారులు తీసుకున్న ఓ నిర్ణయంతో వాహనదారులు మాత్రం ఎగబడి చలాన్లు కడుతున్నారు. ఎంతలా అంటే.. ఏకంగా సర్వర్ హ్యాంగ్ అయ్యేంతలా. వివరాల్లోకి వెళితే.. తెలంగాణలో ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల చెల్లింపునకు భారీ రెస్పాన్స్ వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 9.61 లక్షల చలాన్లు వాహనదారుల ఇప్పటి వరకు చెల్లించారు. చలాన్ల ద్వారా రెండు రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా రూ.8.44 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం హైదరాబాద్ పరిధిలోనే 3.54 లక్షల చలాన్ల చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. దీంతో ఒక్క హైదరాబాద్ పరిధిలో చలాన్లతో రూ. 2.62 కోట్ల ఆదాయం సమకూరింది. సైబరాబాద్ పరిధిలో 1.82లక్షల చలాన్ల చెల్లింపు జరగగా రూ.1.80 కోట్ల ఆదాయం వచ్చింది. రాచకొండ పరిధిలో 93 వేల చలాన్ల చెల్లింపు జరగగా.. రూ.76.79 లక్షల ఆదాయం వచ్చింది. చెల్లింపుల తాకిడితో తరచూ సర్వర్ హ్యాంగ్ అవుతోంది. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల వసూలు విషయంలో తెలంగాణ పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో తెలంగాణ పోలీసులు భారీ డిస్కౌంట్ ఇచ్చారు. గతంలో ఇచ్చిన దాని కన్నా ఎక్కువ వెసులుబాటు కల్పించారు. మరోవైపు ఖమ్మంలోని ట్రాఫిక్ పోలీసులు వాహనాల చలానా డిస్కౌంట్ లపై వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన సెంటర్‌లలో చలాన్లపై ప్రభుత్వం ప్రకటించిన డిస్కౌంట్‌ల గురించి మైక్‌లోచెబుతూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. సెంటర్లలో వాహనదారులను ఆపి వారికి డిస్కౌంట్‌ల గురించి వివరిస్తూ వారితో చలనాలను కట్టిస్తున్నారు ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు. ఇక, ఈనెల 26వ తేదీ నుంచి పెండింగ్ చలాన్లను డిస్కౌంట్‌తో కట్టే అవకాశం కల్పించారు. జనవరి 10వ తేదీ వరకు చలాన్లను ఆన్‌లైన్‌తో పాటుగా మీ సేవ కేంద్రాల్లో కూడా చెల్లించే వెలుసుబాటు ఇచ్చారు. టూ వీలర్స్, త్రీ వీలర్స్ వాహనాలపై 80 శాతం, ఫోర్ వీలర్స్, హెవీ వెహికల్స్‌పై 60 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఆర్టీసీ డ్రైవర్స్, తోపుడు బండ్ల వారికి 90 శాతం రాయితీ ఇచ్చింది.

# ఎంపి ఎన్నికల రేసులో లేను


## మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్ వెల్లడి



హైదరాబాద్, డిసెంబర్ 29 (సమ సమాజం): తాను ఎంపీ టికెట్ రేసులో లేనని, నిజామాబాద్ ఎంపీగా జీవన్ రెడ్డి పోటీ చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఆదేశించినా తాను పోటీ చేయనని స్పష్టం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లక్ష్యం 15 లోక్ సభ స్థానాలు అని చెప్పారు. మెజార్టీ స్థానాలు తమ పార్టీయే గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల వరకు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి కొనసాగుతారని వెల్లడించారు. బీజేపీ నేతల కన్ఫ్యూజన్‌ను క్లియర్ చేయడానికే అమిత్ షా వచ్చారని చురకలంటించారు. అమిత్ షా హైదరాబాద్ వచ్చింది బీజేపీ గెలుపుకోసం కాదని, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని మార్చడానికని జోస్యం చెప్పారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలంగాణ బీజేపీ నేతలు అయోమయంలో ఉన్నారని.. అందుకే ఆ పార్టీ అగ్రనేత అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చారన్నారు. తమ ప్రత్యర్థి కాంగ్రెస్ అని ఓ వైపు బీజేపీ.. మరోవైపు బీఆర్ఎస్ చెబుతున్నాయన్నారు. మజ్లిస్ పార్టీ మద్దతు లేకుంటే కిషన్ రెడ్డి సికింద్రాబాద్ నుంచి గెలవరని విమర్శించారు. ఇతర ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఎల్బీనగర్‌లో తనపై గెలిచిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పార్టీ జంప్ కావడానికి సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. సుధీర్ రెడ్డి అక్రమాస్తులు కాపాడుకోవడం కోసం ఏ పార్టీలోకైనా జంప్ అవుతారని చెప్పారు. ఎన్నికల నాటికి ఎల్బీనగర్ లో 30 వేల ఫేక్ ఓట్లు యాడ్ అయ్యాయని చెప్పారు. గ్రేటర్ లో ముస్లింలు, సెటిలర్ల ఓట్లు బీఆర్ఎస్ కే పడ్డాయని అన్నారు. మంత్రి వర్గ విస్తరణ విషయంలో హైకమాండ్ జోక్యం చేసుకోబోదని, సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయమే ÷నైల్ అని చెప్పారు. మధుయాష్కీ గతంలో నిజామాబాద్ ఎంపీగాఓ సారి విజయం సాధించారు. రెండుసార్లు ఓడిపోయారు. ఇటీవల ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన స్థానికేతరుడు అని టిక్కెట్ ఇవ్వొద్దని చాలా మంది కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేసినా హైకమాండ్‌కు సన్నిహితులు కావడంతో ఆయనకే చాన్స్ దక్కింది. ఇప్పుడు బీసీ కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారని ఆయన ఆశిస్తున్నారు. అందుకే లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయనని అంటున్నారని చెబుతున్నారు. ఓడిపోయిన వారికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవులు ఇచ్చే పరిస్థితి ఉండదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే మధుయాష్కీ రాహుల్ గాంధీకి సన్నిహితులు. ఆయన చెబితే రేవంత్ రెడ్డి పదవి ఇస్తారని అంటున్నారు. అందుకే రేవంత్ రెడ్డి ఇష్టమని మధుయాష్కీ చెబుతున్నట్లుగా భావిస్తున్నారు.

# ఉత్తర భారతాన్ని కమ్మేసిన పొగమంచు

న్యూఢిల్లీ, డిసెంబర్ 29 (సమ సమాజం): దట్టమైన పొగమంచు ఉత్తర భారతాన్ని కప్పివేసింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, పశ్చిమ మధ్యప్రదేశ్‌ను మరో రెండు రోజులపాటు దట్టమైన పొగమంచు కమ్మేసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. డిసెంబర్ 31 తర్వాత పొగ మంచు క్రమంగా తగ్గుతుందని వెల్లడించింది. దీంతో ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో చలి వాతావరణం కొనసాగుతున్నది. చలిగాలుల ప్రభావం వల్ల వచ్చే జనవరి 4 వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. రానున్న ఐదు రోజుల పాటు ఢిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 7 నుంచి 8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.



# మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం బాధాకరం



(మొదటి పేజీ తరువాయి) కుంగినప్పుడు గత ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేకపోయిందన్నారు. రైతులకు స్పష్టమైన సందేశం పంపాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాళేశ్వరం ద్వారా ఎన్ని టీఎంసీల నీరు ఎత్తిపోశారు? అని మంత్రి శ్రీధర్‌బాబు నిలదీశారు. తిరిగి గోదావరిలోకి ఎంత నీటిని వదిలారు? అని ప్రశ్నించారు. ఆదాయం ఎక్కువ చూపారు, రూపాయికి 52 పైసలు మాత్రమే ప్రయోజనం కలిగేలా ఉందన్నారు. కాళేశ్వరం కింద ఎకరాకు నీరు ఇచ్చేందుకు అయ్యే ఖర్చు రూ.46 వేలు అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ 90 శాతం ఎత్తిపోతలకే పోతోందన్నారు. మల్లన్న సాగర్ కోసం భూకంప అధ్యయనం చేశారా? అని మంత్రి శ్రీధర్‌బాబు అడిగారు. బాహుబలి పంపుల నాణ్యత, ధరల గురించి పూర్తి వివరాలు ఇవ్వాలని కోరారు. నిర్మాణంలో చూపిన అత్యుత్సాహం.. నిర్వహణలో ఎందుకు చూపలేదు? అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. మహారాష్ట్రకు కూడా లబ్ధి చేకూర్చేలా 148 మీటర్ల ఒప్పందం చేశామన్నారని.. డయా ఫ్రామ్ వాల్ ఆర్‌సీసీతో కట్టి ఉంటే ప్రమాదం జరిగేదా? అని నిలదీశారు. సీకెంట్ ఫైల్ ఫెయిల్ అయినందుకే రోజు రోజుకు కుంగి పోయిందని వివరించారు. ప్రొటెక్షన్ పనులు ఒక్క వరదకే పోతే ఎలాంటి పనులు చేసినట్లు? అని నిలదీశారు. ప్రమాదం ఉందని 2022లోనే ఈఈపై అధికారులు లేఖ రాశారని వెల్లడించారు. నిర్మాణ సంస్థకు రాసిన లేఖలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని గట్టిగా నిలదీశారు. కాళేశ్వరం అంచనా వ్యయం రూ.1,27,872 కోట్లు కాగా.. కాళేశ్వరం నిర్మాణానికి ఇప్పటి వరకు.. రూ.93,872 కోట్లు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తం రూ.71,565 కోట్లు అప్పుగా తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులో ఇంకా చెల్లించాల్సిన అసలు రూ.66,868 కోట్లు. డిస్కంలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.3,192 కోట్లు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు వాడిన విద్యుత్ 6,918 మిలియన్ యూనిట్లు కాగా ఇప్పటివరకు ప్రాజెక్టు ద్వారా 1,054 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు.

# ట్రంప్‌కు షాక్ మీద షాకులు!



(మొదటి పేజీ తరువాయి) మద్దతుదారులను కోరారు అని షెన్నా బెల్లోస్ పేర్కొన్నారు. ఇక.. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ చేసేందుకు ఆయన అనర్హుడంటూ కొలరాడో కోర్టు ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర రిపబ్లికన్ ప్రైమరీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. క్యాపిటల్ భవనంపై దాడికి సంబంధించిన కేసులోనే కోర్టు ఈ మేరకు సంచలన తీర్పు వెలువరించింది. అధ్య క్ష పదవికి పోటీ చేస్తున్న నేతపై ఇలా అనర్హత పడటం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్రంప్ హింసను ప్రేరేపించారనడానికి బలమైన సాక్ష్యాలు ఉన్నాయని కోర్టు తీర్పు సందర్భంగా వ్యాఖ్యానించింది. అమెరికా రాజ్యాంగం లోని 14వ సవరణ సెక్షన్ 3 నిబంధన ప్రకారం.. ఆయన ప్రైమరీ ఎన్నికల్లో పోటీకి అనర్హుడని తేల్చింది. అయితే దీనిపై యూఎస్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్‌నకు అవకాశం కల్పించింది. అందుకోసం వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకు ఈ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తున్నట్లు తెలిపింది. దీంతో ట్రంప్ భవితవ్యాన్ని అమెరికా సుప్రీంకోర్టు తేల్చనుంది. తాజా పరిణామాలతో (సర్వోన్నత న్యాయ స్థానంలో ఊరట లభిస్తే తప్ప).. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి కొలరాడో, మైనే స్టేట్ జరిగే ఎన్నికల్లో అభ్యర్థుల జాబితా నుంచి ట్రంప్ పేరును తొలగించాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది మార్చి 5న అక్కడ జరిగే రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఎన్నికలు.. నవంబరు 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి.

# 14 రాష్ట్రాల మీదుగా భారత్ న్యాయ యాత్ర



(మొదటి పేజీ తరువాయి) న్యూఢిల్లీ,డిసెంబర్ 29(ఆర్ఎన్ఏ): దేశ ప్రజలను ఏకం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టబోతున్న భారత్ న్యాయ యాత్రకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరమవుతున్నాయి. ఇప్పటికే 14 రాష్ట్రాల మీదుగా 67 రోజుల పాటు యాత్ర చేయాలని నిర్ణయించగా.. దీనికి సంబంధించి ఎగ్జాక్ట్ రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ముఖ్యనేతల భేటీకి పిలుపునిచ్చింది. ఈ భేటీలో రూట్‌మ్యాప్ తోపాటు లోగో, పాటకు సంబంధించి కూడా నిర్ణయం తీసుకోనున్నారు. జనవరి 8న రూట్‌మ్యాప్, జనవరి 12న యాత్రకు సంబంధించిన ప్రత్యేక పాటను విడుదల చేస్తామని చెబుతున్నారు కాంగ్రెస్ నేతలు. ఇప్పటికే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ యాత్ర తీసుకొచ్చిన పాజిటివ్ వైబ్స్ ఇంకా కాంగ్రెస్ క్యాడర్‌లో కంటిన్యూ అవుతూనే ఉన్నాయి. అయితే ఈ సారి దేశంలోని తూర్పు ప్రాంతం నుంచి పశ్చిమ ప్రాంతం వరకు భారత్ న్యాయ యాత్ర చేపట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ యాత్ర మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే ఏడాది జనవరి 14 నుంచి మార్చి 20 వరకు ఈ యాత్ర నిర్వహించనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. మణిపూర్ నుంచి ముంబై వరకు మొత్తం 6 వేల 200 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రలో మహిళలు, యువత, బలహీనవర్గాల ప్రజలను కలిసి మాట్లాడుతారు రాహుల్. మణిపూర్ నుంచి మొదలయ్యే ఈ న్యాయ యాత్ర.. నాగాలాండ్, అసోం, మేఘాలయ, బెంగాల్, బిహార్, ఝార?ండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ మీదుగా సాగి మహారాష్ట్రకు చేరనుంది. ఈసారి మొత్తం 14 రాష్ట్రాల్లోని 85 జిల్లాల మీదుగా ఈ యాత్ర కొనసాగనుంది. అయితే గతంలో మాదిరిగా పూర్తిగా పాదయాత్ర కాకుండా.. ఈ సారి మధ్యమధ్యలో బస్సు యాత్ర కూడా ఉండనుంది.

# ఎన్నికల సంవత్సరం వేళ




(మొదటి పేజీ తరువాయి) ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు వరుసగా రూ.8, రూ.6 తగ్గించింది. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ.96.72కు విక్రయిస్తుండగా, డీజిల్ రూ.89.62గా ఉంది. ముంబైలో లీటరు పెట్రోల్ రూ.106.31, డీజిల్ రూ.94.27గా ఉంది. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా.. పెట్రోలియం శాఖ మంత్రి చమురు ధరలను తగ్గించనున్నట్టు ప్రకటించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు.. చమురు సంస్థలను లాభాల బాటలో నడిపించాయి. దీంతో లీటర్‌పై రూ.10 వరకూ లాభం వస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో దేశీయ చమురు సంస్థలు నష్టాల్లో ఉన్నప్పుడు కేంద్రం రాయితీలు, ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. ప్రస్తుతం లాభాలు వస్తుండటంతో ఇక ఇంధన ధరలను తగ్గించినా కూడా ఇబ్బంది లేదని కేంద్రం భావిస్తోంది. ఈ క్రమంలోనే నూతన సంవత్సర కానుకగా పెట్రోల్ ధరలను తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది.

# గ్యారెంటీల దరఖాస్తు కౌంటర్ల వద్ద అప్లికేషన్ల కొరత



(మొదటి పేజీ తరువాయి) అందజేయగా, తొలి రోజే వేల సంఖ్యలో దరఖాస్తుదారులు కేంద్రాలకు పోటె త్తారు. అరకొరగా తీసుకువచ్చిన కలర్ పేపర్లతో కూడిన దరఖాస్తులు ప్రతి కేంద్రంలో మొదటి గంట లోనే అయిపోతున్నాయి. దాంతో, జిరాక్స్ కాపీలను పంపిణీ చేస్తున్నారు. అవి కూడా కొరవడటం తో కొందరు దళారులు ఒకో దరఖాస్తు ఫారాన్ని రూ.40-రూ.50 తీసుకుని ఇస్తున్నారు. మీసేవ సెంటర్ల నిర్వాహకులు, జిరాక్స్ సెంటర్లు, కొన్ని చోట్ల కిరణాషాపు యాజమానులు బ్లాక్ దందాకు తెరలేపారు. గ్యారెంటీ దరఖాస్తులకు రేషన్‌కార్డు, ఆధార్ పత్రాలు జతచేయాలని ప్రభుత్వం స్పష్టం చేయటంతో జిరాక్స్ సెంటర్ల వద్ద జనాలు క్యూకడుతున్నారు. ప్రజాపాలన కౌంటర్ల వద్ద కంటే జిరా క్స్ సెంటర్లు, మీసేవ సెంటర్ల వద్దే దరఖాస్తుదారులు ఎక్కువగా కనిపిస్తుండటం విశేషం. ఇక, ప్రజా పాలనలో తొలిరోజు.. దరఖాస్తు నిం పటమే దరఖాస్తుదారుడికి ఇబ్బందిగా మా రింది. అప్లికే షన్ ఎక్కడ చేసుకోవాలి? మొదలు అందులో ఉన్న ప్రతి అంశం సవాల్‌గా మారింది. ఆరు గ్యారెంటీల్లో ఏ పథకానికి అ ర్హులు, సరైన విధి విధానాలు పొందుపర్చకుం డా ఆధార్ కార్డు, రేషన్ కార్డు మెలిక ఒకవైపు, దరఖాస్తుఫారాలు ఇవ్వకుండా దరఖాస్తు చేసుకోవాలా? అన్న ప్రశ్నలతో ప్రజల్లో ఆందోళన కనిపించింది. రేషన్ కార్డు ఉన్నదా? ఆధార్ కార్డులో అడ్రస్ ఇక్కడే ఉన్నదా? రేషన్ కార్డు లేకుంటే స్కీమ్స్ రావు.. రేషన్ కార్డు కోసం తెల్లకాగితంలో రాసివ్వండి.. ఒక కుటుంబం లో ఒకటే స్కీమ్.. అంటూ అధికారులు చుక్కలు చూపిస్తున్నారని దరఖాస్తుదారులు అంటున్నారు. ఏ పథకానికి ఏ అ ర్హత ఉంటుందో? ఎలా ఎంపిక చేస్తారో? అన్న గైడ్‌లైన్స్ ఇవ్వకుండా దరఖాస్తులను తీసుకుంటున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది.

# వేగంగా వ్యాపిస్తున్న కొత్త కోవిడ్ వేరియంట్



(మొదటి పేజీ తరువాయి) కోవిడ్ కారణంగానే కాకుండా న్యుమోనియా కారణంగా కూడా ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా మారవచ్చు. %జీచీ%1 ఊపిరితిత్తులకు పెద్ద సవాలుగా మారనుందని తెలుసుకున్న నిపుణులు %జీచీ%1 వల్ల కలిగే అతిపెద్ద సమస్య న్యుమోనియా అని గమనించారు. చాలా మందికి వచ్చిన న్యుమోనియా చాలా తీవ్రంగా ఉందని, అది ప్రాణాపాయం కూడా కలిగిస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. కోవిడ్ వైరస్ వేరియంట్‌లో న్యుమోనియాకు దారితీసే అనేక మార్పులు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏదైనా సందర్భంలో, కోవిడ్-19 సోకిన వారు కొన్ని లక్షణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం మంచిదని సూచిస్తున్నారు. జ్వరం, నిరంతర దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలతో బాధపడేవారు వెంటనే వైద్యులను సంప్రదించటం ఉత్తమం అంటున్నారు. ఎందుకంటే..%జీచీ%1 న్యుమోనియాకు దారితీస్తే కనిపించే లక్షణాలు ఇవే అంటున్నారు.. కోవిడ్‌కు వ్యతిరేకంగా టీకాలు వేయడం ఇప్పటికీ అత్యంత ప్రభావవంతమైన రక్షణగా చెబుతున్నారు. కానీ %జీచీ%1కి వ్యతిరేకంగా టీకాలు వేయడం గురించి ఖచ్చితమైన సమాచారం లేదు.

# టీఎస్ఆర్టీసీకి 1,050 కొత్త బస్సులు



(మొదటి పేజీ తరువాయి) బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. 2024 మార్చి నాటికి విడతల వారిగా అందుబాటులోకి తీసుకొస్తామని సంస్థ ఎండీ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోన్న మహాలక్ష్మి పథకం వలన బస్సుల్లో రద్దీ పెరిగిందని.. అందుకోసం కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. "అత్యాధునిక హంగులతో కూడిన 80 కొత్త బస్సులు శనివారం నుంచి వాడకంలోకి వస్తాయి. వాటిలో 30 రాజధాని ఏసీ, 30 ఎక్స్‌ప్రెస్, 20 లహరీ స్లీపర్ కమ్ సీటర్(నాన్ ఏసీ) బస్సులు ఉన్నాయి. ఈ కొత్త బస్సులను హైదరాబాద్.. ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తాం. తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై కొత్త బస్సులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు" అని సజ్జనార్ తెలిపారు.

# రేషన్ కార్డు ఉంటేనే రైతుభరోసా?



(మొదటి పేజీ తరువాయి) తీసుకునే అవకాశం ఉన్నదని తెలిసింది. ఆహార భద్రత నిబం ధనల ప్రకారం తెల్ల రేషన్‌కార్డు పొందాలంటే తడి భూమి 3.5 ఎకరాల వరకు, మెట్ట భూమి 7.5 ఎకరాల వరకు ఉండాలి. అంటే ప్రస్తుతం తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్నవారికి గరిష్ఠంగా 7.5 ఎకరాల వరకు భూమి ఉంటుంది. దీంతో రైతుభరోసాకు తెల్ల రేషన్‌కార్డును లింక్ చేస్తే 7.5 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు మాత్రమే పెట్టుబడి సాయానికి అర్హులు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రభు త్వం కూడా రేషన్‌కార్డు నిబంధనలకు కాస్త అటుఇటుగా భూ పరిమితి పెట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రైతుబంధులో సుమారు 70 లక్షల మంది రైతులు ఉండగా, 1.52 కోట్ల ఎకరాల భూమి ఉంది. ఇందులో 8 నుంచి 54 ఎకరాల వరకు సుమారు 3 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరి వద్ద 26 లక్షల ఎకరాల భూమి ఉన్నది. వీరికి సుమారు రూ.13 కోట్ల వరకు రైతుబంధు అందు తున్నది. అయితే 8 ఎకరాల్లోపు రైతుల్లోనూ రేషన్‌కార్డు లేని రైతులు చాలా మంది ఉన్నారు. ఇప్పుడు వారు రేషన్‌కార్డు లేకపోతే రైతుభరోసా ఇవ్వరా? అని ఆందోళన చెందుతున్నారు.ప్పటికే సీఎం, మంత్రుల సంకేతాలు తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ రైతుభరోసాలో భూ పరిమితికి మద్దతుగానే తన వైఖరిని వెల్లడించింది. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ఆ పార్టీ మంత్రి సీతక్క, సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రైతుభరోసా పరిమితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. పెద్ద పెద్ద భూస్వాములకు, పాడుపడ్డ భూములకు రైతుబంధు ఇస్తున్నారని, దీన్ని కచ్చితంగా సవరిస్తామని స్పష్టం చేశారు. గ్యారెంటీల దరఖాస్తు ఆవిష్కరణ సందర్భంగానూ రైతుభరోసా పరిమితిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించటంతో దీనిపై జోరుగా చర్చ జరుగుతున్నది. అయితే ఈ యాసంగి సీజన్‌కు నిబంధనల్లో మార్పులు చేర్పులకు సమయం లేకపోవటంతో ఈసారికి పాత పద్ధతిలోనే రైతుబంధు పంపిణీ చేస్తోంది.. వానకాలం సీజన్ నాటికి భారీ మార్పులు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద ఏటా ఎకరానికి రూ.10 వేలు ఇవ్వగా కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇది అమలు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఏటా అదనంగా రూ.7,500 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. అంటే ప్రస్తుతం ఏటా రూ.15 వేల కోట్లు అవసరం అవుతుండగా, ఇక నుంచి రూ.22,500 కోట్లు అవసరం కానున్నాయి. అయితే ఇంత ఆర్థిక భారం మోయడం ప్రభుత్వానికి ఇబ్బందికరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి..

# తెలంగాణ 'ప్రజాభవన్' ఘటనలో కొత్త కోణం




(మొదటి పేజీ తరువాయి) పంపారు. ఈక్రమంలో నిందితుడు తప్పించుకొని, అప్పటికే బయటున్న కారులో ఇంటికి వెళ్లాడు. తమ డ్రైవర్‌ను తన స్థానంలో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు పంపాడు. అతడితో ప్రమాద సమయంలో తానే కారు నడిపినట్టు వాంగ్మూలం ఇప్పించేలా పురిగొల్పాడు. విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూశాక కూడా ఉన్నతాధికారులకు ఇన్‌స్పెక్టర్ అసలు విషయం చెప్పకుండా గోప్య త పాటించినట్టు తేలింది. నిందితుడు తప్పించుకొని ముంబయికి, అక్కడి నుంచి దుబాయ్ పారిపో యేందుకు సహకరించినట్టు అధికారులు అంచనాకు వచ్చారు. దర్యాప్తును పక్కదారి పట్టించడంలో ఇన్‌స్పెక్టర్ కీలకంగా వ్యవహరించినట్టు పంజాగుట్ట ఠాణా సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారాలు సేకరిం చారు. ఉద్దేశపూర్వకంగానే చేసినట్టు గుర్తించాకనే.. ఇన్‌స్పెక్టర్ దుర్గారావును సస్పెండ్ చేసినట్టు స మాచారం. ఈవ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉందనే విషయమై ఆరా తీస్తున్నారు.

# ఉత్తమ ఫుడ్ లిస్ట్‌లో 'హైదరాబాద్ బిర్యానీ'కి చోటు

### ప్రపంచ వ్యాప్తంగా అరుదైన గుర్తింపు

హైదరాబాద్, డిసెంబర్ 29 (సమ సమాజం): ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ బిర్యానీకి ఉన్న క్రేజ్ అంతా ఇంతాకాదు. హైదరాబాద్ బిర్యానీ అంటేనే లొట్టలేసుకునే వారు చాలా మందే. అయితే ఈ బిర్యానీకి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరుంది. బిర్యానీ ప్రియుల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. ఇటీవల స్విగ్గీలో అత్యధిక ఆర్డర్లు వచ్చిన ఫుడ్‌లో కూడా హైదరాబాద్ బిర్యానీ ఉంది. ఇక తాజాగా, ట్రావెల్ గ్లోబల్.. ఈట్ లోకల్ అనే అంశంతో పని చేసే ప్రముఖ పర్యాటక ఆన్ లైన్ టేస్ట్ అట్లాస్ ప్రకటించిన ఉత్తమ ఆహార పరదార్థాల జాబితాలో కూడా మన హైదరాబాద్ బిర్యానీ స్థానం దక్కడ గమనార్హం. అయితే సదరు కంపెనీ వివిధ దేశాలకు చెందిన నగరాలు.. అక్కడి ఫుడ్‌పై సమీక్ష జరిపింది. పూర్తి సమీక్ష జరిపిన తర్వాతే ఈ జాబితాను విడుదల చేసింది. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా టాప్ 50 నగరాల్లో మన హైదరాబాద్ బిర్యానీ 39వ స్థానం దక్కించుకోగా, ముంబై 35వ స్థానం దక్కించుకుంది. అలాగే ఢిల్లీ 56వ స్థానం, చెన్నై 65వ స్థానం, లక్నో 92వ స్థానం దక్కించుకుంది. అలాగే ఈ ఫుడ్ జాబితాలో అగ్రస్థానం ఇటలీ వంటకాలు దక్కించుకున్నాయని సదరు కంపెనీ తెలిపింది. మన దేశ ఆహార పదార్థాల్లో పావ్ భాజీ, దోశ, వడాపావ్, కబాబ్స్, పానీపురి, బిర్యానీలను అధికంగా ఇష్టపడుతున్నట్లు ప్రకరటించింది. ఇక ఏదీ ఏమైనా మన హైదరాబాద్ విషయానికి వస్తే బిర్యానీకే టేస్ట్ ఫుడ్ అట్లాస్ జై కొట్టిందని చెప్పాలి.

# రాష్ట్రంలో 8.97 శాతం పెరిగిన నేరాలు

### డ్రగ్స్, సైబర్ క్రైమ్స్ ఎక్కువయ్యాయి

### డ్రగ్స్ విషయంలో ఎంతటి వారినైనా విడిచిపెట్టం

### డీజీపీ రవి గుప్తా వెల్లడి

### తెలంగాణ రాష్ట్ర వార్షిక నేర నివేదిక విడుదల



హైదరాబాద్, డిసెంబర్ 29 (సమ సమాజం): తెలంగాణ రాష్ట్ర వార్షిక నేర నివేదికను డీజీపీ రవి గుప్తా వెల్లడించారు. గత ఏడాదితో పోల్చితే రాష్ట్రంలో 8.97 శాతం నేరాలు పెరిగాయని తెలిపారు. సమాజంలో డ్రగ్స్, సైబర్ క్రైమ్స్ ఎక్కువ అయ్యాయని ఈ విషయంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులు డ్రగ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. డ్రగ్స్ విషయంలో ఎంతటి వారినైనా విడిచిపెట్టమని హెచ్చరించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. 41 శాతం కోర్టు శిక్షలు పెరిగాయని డీజీపీ పేర్కొన్నారు. 175 మంది నేరగాళ్లపై పీడీ చట్టం ప్రయోగించామన్నారు. సోషల్ మీడియా ద్వారా 1 లక్షా 38 వేల ఫిర్యాదులు అందాయన్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్ విజయవంతగా నడుస్తోందన్నారు. రాష్ట్రంలో 100, 112 కు 16 లక్షల ఫోన్ కాల్స్ వచ్చాయని .. 7 నిమిషాల్లో రెస్పాండ్ అయ్యామని డీజీపీ వెల్లడించారు.

# న్యూ ఇయర్ వేడుకలపై మళ్లీ ఆంక్షలు

### తనిఖీలు తప్పవన్న ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్, డిసెంబర్ 29 (సమ సమాజం): కొత్త సంవత్సర వేడుకలపై ఈ యేడు కూడా ఆంక్షలు తప్పడం లేదు. కరోనాతో మళ్లీ ఆంక్షల హెచ్చరికలు మొదలయ్యాయి. దీంతో బహిరంగంగా పార్టీలకు అవకాశం లేదు. కరోనా జాగ్రత్తలు, ఆంక్షల మధ్య నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇకపోతే ఇప్పటికే డ్రగ్స్ పని పట్టే క్రమంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. న్యూ ఇయర్ రోజు కూడా వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నగరవ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు. మోతాదుకు మించి మద్యం సేవించి పట్టుబడితే.. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి 11 గంటల నుంచి జనవరి ఒకటో తేదీ 5 గంటల వరకు తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. మద్యం తాగి పట్టుబడిన వారి వాహనాలు జప్తు చేయడంతో పాటు వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కేసులకు సంబంధించిన వివరాలు పాస్‌పోర్ట్, వీసా, ఆధార్ కార్డుకు అనుసంధాని స్తామని.. దీనివల్ల వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతున్నా యన్నారు. ప్రజలందరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

# విచారణకు ముందే మంత్రుల తీర్పులు

### కాళేశ్వరపై మంత్రుకలు కడియం కౌంటర్




హైదరాబాద్, డిసెంబర్ 29 (సమ సమాజం): కాళేశ్వరంపై జ్యూడిషియల్ ఎంక్వైరీ కచ్చితంగా చేయాలని బిఆర్ఎస్ కోరుకుంటోందని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అయితే విచారణ జరగకముందే మంత్రులు తీర్పులు చెబుతున్నారని వ్యంగ్యస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కౌంటర్ ఇచ్చారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినట్లు తెలిపారు. అంచనాలు పెంచి కట్టారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారని.. పవర్ జనరేట్ ప్రాజెక్టులు, సబ్ స్టేషన్‌లు, లిఫ్టులు ఏర్పాటు చేయడం వల్లే అంచనా పెరిగిందని పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద, 19, 20, 21 పిల్లర్లు కుంగడం దురదృష్టకరమని.. ఈ ప్రాజెక్టుపై పూర్తిస్థాయి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కూడా కోరుకుంటోందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి చాలా విషయాల్లో అవగాహన ఉందని భావించానని..కానీ ఆయనే పూర్తిగా తెలుసుకోకుండా తీర్పునిస్తున్నారని మండిపడ్డారు. గతంలో తాను డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు సీఎం హోదాలో కేసీఆర్‌తో కలిసి ప్రధాని వద్దకు వెళ్లి కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలని అడిగిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీకి అడుగడుగునా విషం నింపుకుంది కాబట్టే హోదా ఇవ్వలేదని దుయ్యబట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయా హోదా తీసుకురావాలని, ఇందుకు తాము కూడా మద్దతిస్తామని తెలిపారు. కాళేశ్వరం సందర్శన కోసం వెళ్లిన మంత్రులు.. అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారని అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేక ఆర్థిక వనరులు సమకూర్చుకోలేక జనాన్ని మోసం చేయటానికి కొత్త డ్రామాలకు తెర లేపారని విమర్శించారు. శ్వేత పత్రాలు అంటూ కొంత కాలయాపన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ప్రాజెక్టులో అవినీతి అంటూ కాలం గడుపుతుందని మండిపడ్డారు. రూ. 93 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ్మిడిహోట్టి దగ్గర కట్టింది కూడా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రోజెక్ట్ మాత్రమేనని తెలిపారు.

# జనవరి 4 నుంచి టీడీపీ బీసి ప్రచార యాత్ర



అమరావతి, డిసెంబర్ 29 (సమ సమాజం): ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు టీడీపీ అన్ని వ్యూహాలను సిద్ధం చేస్తోంది. గత ఎన్నికల సమయంలో పార్టీకి దూరమైన వర్గాలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. బీసీలను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం వివరాలు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల ద్రోహి అని నారా లోకేశ్ విమర్శించారు. వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. అందుకే ఆయావర్గాల్లో చైతన్యం తీసుకొస్తామని స్పష్టం చేశారు. జనవరి 4 నుంచి జయహో బీసీ కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించింది. ఈ కార్యక్రమం 2 నెలలపాటు కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమం తొలి విడతలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల్లో జరుగుతుందని లోకేశ్ తెలిపారు. క్షేత్రస్థాయి టీడీపీ నేతలు పర్యటిస్తారన్నారు. బీసీల కష్టాలు తెలుసుకుంటారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. బీసీల కోసం ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేస్తామని నారా లోకేశ్ ప్రకటించారు.బీసీలు బలహీనవర్గం కాదు..బలమైన వర్గమని నారా లోకేశ్ అన్నారు. వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. బీసీలకు పర్మినెంట్ కుల ధృవీకరణ పత్రం ఇస్తామని హామీ ఇచ్చారు. ఉపకులాలవారీగా నిధుల కేటాయిస్తామని ప్రకటించారు. టీడీపీ హయాంలో బీసీ సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టామన్నారు. ఎక్కువ సీట్లు బీసీలకే కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. ఓడిపోయే సీట్లు బీసీలకు వైసీపీ కేటాయిస్తుందని విమర్శించారు. మంగళగిరిలో వైసీపీకి ఓటమి ఖాయమన్నారు. కడప, పులివెందుల సీట్లు బీసీలకు ఎందుకివ్వరు? లోకేశ్ ప్రశ్నించారు.

# బరువును నియంత్రించే శాఖాహారం



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 29 (సమ సమాజం): బరువు తగ్గడానికి తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ప్రోటీన్ తీసుకునేందుకు రకరకాల ఆహార విధానాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. కీటో డైట్ విధా నమైతే శరీరానికి కావాల్సిన శక్తిలో 5-10 శాతాన్ని మాత్రమే పిండిపదార్థాల నుంచి స్వీకరించాలం టోంది. అయితే జంతుమాంసం నుంచి కాకుండా మొక్కల నుంచి మాంసకృత్తులను, ముతక ధా న్యాల నుంచి కొవ్వులు, పిండి పదార్థాలను స్వీకరిస్తే బరువు పెరుగుదల చాలా తక్కువగా ఉంటుం దని అమెరికాలో 20 ఏళ్లపాటు 1.23 లక్షల మందిని అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు తేల్చారు. జం తుమాసం, శుద్ధి చేసిన ధాన్యాలను తినడం వేగంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. ఎంత ఆరో గ్యకరమైన ఆహారం తీసుకున్నా బరువు తగ్గుదల అనేది శరీర ద్రవ్యసూచీ (బీఎంఐ) మీద కూడా ఆధారపడి ఉంటుంది. ఎక్కువ బీఎంఐ ఉన్న స్థూలకాయులు ఆరోగ్యకరమైన శాక సంబంధిత పిండిపదార్థాల ఆహారం తీసుకున్నాక.. ఇతరులతో పోలిస్తే వారిలో బరువు పెరుగుదల 1.63 కిలోల మేర తక్కువగా కనిపించింది. బీఎంఐ 25 లోపు ఉన్నవారిలో ఈ తరుగుదల 0.39 కిలోలుగా నమో దైంది. తీసుకునే ఆహార పరిమాణం మాత్రమే కాదు, దాని నాణ్యత కూడా ముఖ్యమే.

# ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కు అడ్రస్ ఉండదు

### పక్క రాష్ట్రంలో శాశ్వత నివాసం

### మోసాలు చేసేవారికి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు


### పవన్ కల్యాణ్ పై జగన్ ఘాటు విమర్శలు



అమరావతి, డిసెంబర్ 29 (సమ సమాజం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భీమవరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. అరాచక శక్తులకు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. దత్తపుత్రుడు పక్క రాష్ట్రంలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పవన్ కల్యాణ్ అడ్రస్ ఉండదన్నారు. చంద్రబాబు సీఎం అయితే చాలు అని అవే వేలకోట్లు రూపాయలని భావిస్తున్నారన్నారు. అసలు పొత్తులో ఎన్ని సీట్లు ఇచ్చినా అసలు సీట్లు ఇవ్వకపోయినా ఒప్పుకుంటాడన్నారు. మోసాలు చేస్తూ ప్రజలను దోచుకునేవారికి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు అని పవన్ కళ్యాణ్‌పై ధ్వజమెత్తారు. ప్రజలు కోసం త్యాగాలు చేసే నాయకులు ఉంటారు. అయితే ఈ దత్తపుత్రుడు ప్యాకేజీల కోసం తనను నమ్ముకున్న వారిని త్యాగం చేసే రాజు పవన్ కల్యాణ్ అని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఆడవాళ్లను ఆట వస్తువులుగా చూస్తూ పెళ్లి అనే పవిత్ర వ్యవస్థను నాశనం చేసిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని జగన్ విమర్శించారు. నాలుగేళ్లకొసారి పెళ్లి చేసుకోవడం తిరిగి వారికి విడాకులు ఇవ్వడం మళ్ళీ మరొకర్ని పెళ్ళి చేసుకోవడం అలవాటుగా మారిందన్నారు. కార్లను మార్చినంతా సులభంగా భార్యలను మార్చుతున్నా పవన్ కల్యాణ్ ఈ రాష్ట్రాన్ని సక్రమంగా పరిపాలిస్తారన్న నమ్మకం లేదన్నారు. ఇలాంటివారిని మనం నాయకులగా ఎన్నుకుంటే రాష్ట్రంలో ఆడపిల్లలు పరిస్థితి దారుణంగా ఉంటుందని విమర్శించారు. సమాజంలో ఇటువంటి వ్యక్తులను ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు అయితే భావితరాలు వారు వారిని స్ఫూర్తిగా తీసుకుంటే నేటి సంప్రదాయం కుటుంబం వ్యవస్థ నాశనం అవుతుందన్నారు. ప్యాకేజీలు కోసం తమ పార్టీ కార్యకర్తలను తాకట్టు పెడుతున్న ఈ దత్తపుత్రుడు రాజకీయాలు చేయడానికి అర్హత లేదన్నారు. నాయకత్వం, విశ్వసనీయత లేని వారిని ఎన్నుకుంటే ప్రజలకు మంచి జరగదు అని సీఎం జగన్ పేర్కొన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్‌లో భాగంగా 23-2024 విద్యా సంవత్సరంలో జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి అర్హలైన 8,09,093 మంది విద్యార్థులకు రూ.584 కోట్లు రూపాయలను పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన కార్యక్రమంలా సీఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ కసరత్తు

## నేడోరేపో పరీక్షల షెడ్యూల్ విడుదల!



హైదరాబాద్, డిసెంబర్ 29 (సమ సమాజం): తెలంగాణలో పరీక్షల షెడ్యూల్ విడుదలకు సమయం ఆసన్నమైంది. గురువారం ఇంటర్ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయతే తాజాగా పదో తరగతికి సంబంధించిన షెడ్యూల్‌ను కూడా విడుదల చేసేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారైనట్లు తెలుస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జరిపిన సమీక్షలో పరీక్షల షెడ్యూల్ దాదాపుగా ఖరారైనట్లు సమాచారం. ప్రభుత్వం కూడా ఇందుకు ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం అనంతరం పదవ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం పదో తరగతి షెడ్యూల్‌కు సంబంధించి అధికారికంగా ప్రకటనరానున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే 2024 మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఆమోదం తర్వాత వెంటనే షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేసిన విషయం తెలిసిందే. 2024, ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు గురువారం వెల్లడించింది. మార్చి 18వ తేదీ వరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్.. మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ సెకండ్ ఈయర్ పరీక్షలు జరగనున్నాయి. ఇక ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల (జనరల్/వొకేషనల్ కోర్సులు) విషయానికొస్తే.. ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహి ంచనున్నారు. రెండో శనివారం, ఆది వారాల్లోనూ ఈ పరీక్షలు జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ప్రాక్టికల్స్‌ను రెండు సెషన్స్‌లో నిర్వహించను న్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షను ఫిబ్రవరి 16న నిర్వహించనున్నారు.

# తెలంగాణలో కరోనా తాజా కేసుల ఎన్ని?

**హైదరాబాద్ , డిసెంబర్ 29(సమ సమాజం): కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 తో కేసులు పెరుగు తుండటంతో యావత్తు దేశం అప్రమత్తమైన విషయం తెలిసిందే. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది.. మొన్నటి వరకు కరోనా కేసుల వివరాలతో కూడిన రోజువారీ బులిటిన్‌ను విడుదల చేసిన వైద్యారోగ్యశాఖ రెండు రో జులుగా బులిటిన్‌ను నిలిపివేసింది. రాష్ట్రవ్యాప్తంగా రోజూ 10 నుం చి 12 కేసులు నమోదయ్యా యి. అందులో 90 శాతం కేసులు గ్రేటర్ పరిధిలోవే. అనారోగ్యంతో ఉస్మానియా జనరల్ హాస్పిట ల్‌లో చేరిన ఐదుగురు రోగులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కాగా, వారిలో ఇద్దరు మృతిచెందారు. మరుసటి రోజు బులెటిన్‌ను నిలిపివేశారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో గురువారం ఒక్కరోజే 87 కేసులు నమోదై, రెండు మరణాలు సంభవించాయి. ఇలాంటి సమయంలో రాష్ట్రంలో కొవిడ్ తాజా కేసుల సమాచారం ఇవ్వకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.**

# తిరుమలలో వైభవంగా ప్రణయ కలహ మహోత్సవం

అమరావతి, డిసెంబర్ 29 (సమ సమాజం): మలయప్పస్వామి వారు పల్లకీ ఎక్కి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి వద్దకు వచ్చారు. ఇంతలో అమ్మవార్లు చెరొక పల్లకీపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిలుచున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరఫున జీయ్యంగార్లు పూలచెండ్లతో స్వామివారిని మూడుసార్లు తాడించారు.స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు.అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూరహారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆస్థానం నిర్వహించారు.ఈ ఉత్సవంలో శ్రీ నమ్మాళ్వార్ రచించిన ఆళ్వార్ దివ్య ప్రబంధంలోని పాసురాలను నిందా -స్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేయడం ప్రత్యేకతకాగా ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్ స్వామి తోపాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరణ

### అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

### ప్రజలను పాలకులుగా చేసే ప్రభుత్వం కాంగ్రెస్సే

### సురభి నాగేందర్ గౌడ్.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు.



బొంతపల్లి, డిసెంబర్ 29 (సమ సమాజం): నిస్సహాయులైన అర్హులు ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభిం చిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురభి నాగేందర్ గౌడ్ అన్నారు. బొంతపల్లి గ్రామంలో అభయహస్తం ఆరు గ్యారెంటీలు అమలును అర్హులైన పేదలకు పారదర్శ కంగా అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజా పాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులను దగ్గరుండి అధికారులు ప్రజలనుండి స్వీకరిస్తున్నా విషయంపై పరివేక్షించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురభి నాగేందర్ గౌడ్.బొంతపల్లి గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, డిసెంబర్ 29 నుంచి జనవరి 6వ తేదీ వరకు పది రోజులు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

**Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*,** Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at *Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU*,**
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in